# ఆనందమయి

శ్రీమతి కె. కృష్ణాకుమారిగారు

ఆనందమయి చాల చక్కని బాలిక. బ్రాహ్మణులలో ప్రసిద్ధికెక్కిన కుటుంబము నందుద్భవించెను. ఆమె జన్మస్థానము అమరావతి గ్రామము. ఆమె తల్లిదండ్రులకు లేక లేక కలిగిన ముద్దులబిడ్డ. ఆమె జన్మించి దినదినము శుక్లపక్షచంద్రునివలె నభివృద్ధి నొందుచుండెను.

ఇట్లుండగా నామెకు 9 సం॥లు వచ్చెను. ఆమె పుష్టిగలపిల్ల యగుటచేత తల్లిదండ్రులప్పుడే భయపడజొచ్చిరి. వారు సనాతనిష్ఠులగుటచేత వివాహముచేయ ప్రయత్నములు చేయసాగిరి. ఆమెకు 9 సం॥ల 10 రోజులకే వివాహముచేసిరి. కర్మమేమోగాని తరువాత మూడు నెలలకే ఆమెతల్లి దివికేగెను. పిమ్మట రెండు నెలలకే భర్తయు స్వర్గస్థుడయ్యెను. ఈకష్టముల కామె తండ్రి బెదరక బిడ్డకు దిక్కు కావలెనని వంకబెట్టి తాను ద్వితీయ వివాహమాడెను. ద్వితీయ వివాహము అయిన కొద్దిరోజులకు ఆయన పుత్రికకును భార్యకును సరిపడ లేదనియామెను రా... పట్టణములో బాలికాపాఠశాలలో జేర్పించెను. అనంతరము క్రొత్తభార్యతో వేగలేకను నవయౌవనాంగియగు బిడ్డ దౌర్భాగ్యము చూడలేకను సనాతనిష్టు చావుకు సిద్ధమయ్యెను. చచ్చిపోవునప్పుడు ఆయన దగ్గరబంధువునొకని బిడ్డకు సంరక్షకునిగ నేర్పరిచి చనిపోయెను. మరియు నాయన ఆస్తిని భార్యకును పుత్రికకును సమముగ భాగించి ఆజన్మాంతము అనుభవించి చచ్చిపోవునప్పుడు ఇహలోకములో విడచిపెట్టునట్లు విల్లువ్రాసెను: పాపము... ఆనందమయి అనాథయైరా... పట్టణములో బాలికలతో చదువుకొనుచు నానందములో మునిగిపోయెను.

2 వ బిందువు

రా.. పట్టణ పాఠశాలఅంతయు నిట్టి అనాథబాలికలతో నిండియుండెను. అచ్చట ఆబాలికలతో ఆడుట పాడుట మొదలగు వానితో సంతోషముగనుండెను. ఈమెకు నవయౌవనము ప్రవేశించిన కొలదియు రూపును శోభాయమానముగ నుండదొడంగెను. అచ్చటి పాఠశాలాధికారురాలును ఆమె నెక్కువ ఆదరించుచుండెను.

వారమున కొకమారు బాలికలందరను గోదావరియొడ్డునకుషికారునకును టాకీలకును నాటకములకును తీసుకొని వెళ్లునది. బాలికలచేత నాటకములువేయుట మొదలగు సంతోషములైన పనులు చేయించుచుండెడిది. ఆనందమయికి పుష్పములనిన బహుప్రీతియగుటచేత ఆమె ఆమెచేత త్రవ్వించి మొక్కలు నాటుట నీరుపోయుట చేయించుచుండెడిది. చదువుకొనుటకు నవలలు నవీనభావములుగల పుస్తకములు నిచ్చుచుండెను. వానిని చదువుటవలన బాలిక లందరకును ఆభావము లుదయించు

చుండెను. కొన్ని సమయము లప్పుడు వారు పునర్వివాహములనుగురించి అనేకవిధముల చర్చించుచుండెడివారలు.

ఇట్లుండగ నొక దినమున ఆనందమయి తన మిత్రురాలగు నొక బ్రాహ్మణేతర బాలికతో వారింటికి వెళ్లెను. అచ్చట ఆమె తన మిత్రురాలి సహోదరుని చూచెను. అతను చాల మంచివాడు, చక్కనివాడు, కరుణామయుడు. అతనును అతని తల్లిదండ్రులు సహోదరులు సహోదరిణులునుగూడ బ్రాహ్మణులను బోలియుందురు. వారలును మాంసాహారమును విడిచి బ్రాహ్మణులవలె శాకాహారులైరి. ఆమె అతనిని చూచిననాటినుండియు నతనిని తన ప్రభునిగ చేసుకొను తలంపుతో నుండెను. స్నేహితురాం డ్రెన్నియడిగినను చెప్పక చాలకాలము గడిపెను. ఇట్లు కొద్ది కాలము గడచిన తరువాత ఆమె రహస్యముగ నా బ్రాహ్మణేతర బాలికతో చెప్పి వారల అంగీకారము నడిగెను. ఆమెయు తన తల్లిదండ్రులతోను సహోదరులతోను జెప్పెను. దానికి వారందరు నంగీకరించిరి. మరియు తన ప్రాణస్నేహితురాండ్రతో కూడ జెప్పెను. వారును సంతోషముతో నంగీకరించిరి. దానిని జూచి ఆమె యుప్పొంగి పోవుచుండెను. పాపము! రాగల చిక్కులామె కగోచరములై యుండెను. సామాన్యముగ వారలయింటికి పోవుటవచ్చుట మొదలుగునవి చేయుచుండెను. ఇట్లొక సంవత్సరము జరిగినది. అప్పుడు బ్రాహ్మణేతరులు వివాహమునకు త్వరపెట్ట నారంభించిరి.

3 వ బిందువు.

ఒకరోజున ఆమె మెల్లగ పాఠశాలాధికారిణి యొద్ద కూర్చుని సంగతుల నన్నియు జెప్పి వివాహమున కనుజ్ఞ యియ్య వేడెను. దానికి ఆమె:—అమ్మా! మనము బ్రాహ్మణులము అట్టివారలను వివాహము జేసుకొనరాదు.

ఆ:—ఎందువలననో జెప్ప వేడుచున్నాను.

పా. అ:—అమ్మాయి! మనము బ్రాహ్మణులము. వారు బ్రాహ్మణేతరులు. మనము వారికన్న పైకులజులము, వారలు మాంసాహారము తిందురు, కనుక చేసుకొనకూడదు.

ఆ:—నేను ప్రేమించి యుంటినికదా!

పా. అ:—నీ ప్రేమ త్రిప్పుకొనుము. నేను బ్రాహ్మణబాలుడును చక్కనివాడును నగు వాని కిచ్చి వివాహము చేయుదును.

ఆ:—కులమూ! శీలమూ! స్త్రీలకు కావలసినది, నా ప్రేమ శీలమునాశ్రయించినది! ఇందు తప్పేమి గలదు?

పా. అ:—నేను నీకు చెప్పజాలను. నీ సంరక్షకునకు కబురు పంపుదునని వెంటనే ఉత్తరమువ్రాసి పోస్టులో వేసెను.

మరునాడు మధ్యాహ్నము రెండుగంటలకు ఆనందమయి విచారముతో తన గది లోపల పరుండియుండెను. అట్టిసమయమున

ఉత్తరము చేతదాల్చి పాఠశాలాధికారిణి అచ్చటికివచ్చి కూర్చుంచెను. తరువాత ఉత్తరము చదువ మొదలిడెను.

అమరావతిగ్రామము 6-5-30

అమ్మా!

మీఉత్తరము అందినది. మీరు చెప్పి చూచినారంటిరి గదా! దాని ఖర్మము పురాకృతమువలన దాని కాస్థితి పట్టినది. అది మీయొక్కయు నాయొక్కయు మాట విననిచో ఇంటినుండియు జాతినుండియు వెలివేయుదును. మీరు పాఠశాలలో నుండి వెడలగొట్టుడు. అందులకే పూర్వులు స్త్రీకి విద్య కూడదందురు. అనాథయని విద్య చెప్పించుచుండ నిట్లు వంశమున కప కీర్తి తెచ్చుచున్నది. మీరు మరల చెప్పుడు. విననిచో వెడలగొట్టుడు—

చిత్తగించవలెను—

ఇట్లు

ఆనందమయి సంరక్షకుడు.

అని చదివెను. దానిని విని ఆనందమయి వెక్కివెక్కి యేడువదొడంగినది. అధికారిణియు కోపముతో బడికి వెడలిపోయెను. తోడిబాలికలందరు నాదినమునుండియు నామెను హీనముగ చూడసాగిరి. పాపము! దానిని ఆనందమయి భరింప జాలకుండెను.

4 వ బిందువు

ఒకదినము రాత్రి 12 గం॥ల సమయమున ఒకవ్యక్తి ముసుగు వేసుకొని గోదావరీముఖముగ నేగుచుండెను.

ఆమె కొంతసేపటికి గోదావరిని జేరి ఈ క్రిందివిధముగ ప్రలాపింప దొడంగెను.

"తల్లీ! గోదావరీ! శరణు...శ...ర......ణు. నే నీఅవమానము భరింపజాల...భరింపజాల! నన్ను నీలో లీనము చేసుకొనుము. అనాథను! దిక్కులేనిదానను! దిక్కులేనివారికి దిక్కునీవే! జననీ! గోదావరీ! ఇదిగో నీబిడ్డ వచ్చుచున్నది: కాగలిమ్ము. నేనేమి తప్పుచేసితినని నన్నిట్లు అనాథను జేసితివి! ఇదిగో నీపుత్రిక వచ్చుచున్నది. నీగర్భములో తావిమ్ము! అని ఆ పిచ్చిది నీటిలో నురికెను.

ఆమరునాడు పాఠశాలలో ఆనందమయి కానరాలేదు. అందరును వెతకుచుండిరి. అడుగుల జాడనుబట్టి పోయిరి — అడుగులు గోదావరిలోని కరిగినవి. జాలరులుపడ వెతకిరి. ఎచ్చటను కనుపడలేదు ఆమె యేఋషిఆశ్రమములో జేరితపము జేయుచుండెనో! లేక ఆ మహాస్రవంతిలోపడి లీనమై నిరంతర మావీచికలచే బాలవితంతు విలాపంబు గానంబు సేయుచుండెనో! లేక ఈ పంచమహాభూతములందు గలసి ప్రతినగర నారీమణుల హృదయములందు జేరి కరుణారసంబుతో జాతీయతత్వం బుద్బోధించుచుండెనో తెలియరాదుగా —



1011